# 'ఆర్వోఆర్' బిల్లుపై సలహాలివ్వండి..

## భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై సలహాలు, సూచనలు అందించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కోరారు. శనివారం ఐడీవోసీ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతులు, యువకులు, పాత్రికేయులు, నిపుణులతో కలెక్టర్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం నూతన రెవెన్యూ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని, ఇందు కోసం నూతన రెవెన్యూ చట్టం-2024 ముసాయిదా బిల్లును రూపొందించిందని అన్నారు. బిల్లు అంశాలు, రైతుల భూ రికార్డులు పకడ్బందీగా ఉండాలనే ఉద్దేశంతో ముసాయిదా బిల్లుపై మేధావులు, విద్యావేత్తలు, రెవెన్యూ, రిటైర్డ్ అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులు, రైతులు, రైతు సంఘం నాయకులు తమ తమ సూచనలు అందజేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ చట్టంలో మార్పులు చేసే సమయంలో భూ సర్వే నిర్వహించాలని, భూమిపై ఉన్న రైతుల వివరాలు మాత్రమే నమోదు చేయాలని తెలిపారు. గ్రామాల వారీగా ఉన్న సర్వే నంబర్లలో భూమి ఎక్కువగా ఉంటుందని, దీనిని సరిచేయాలని, భూమి అమ్మిన వారి పేర్లను తొలగించాలని, ఈ చట్టం ద్వారా గతంలో జరిగిన తప్పు మళ్లీ జరగకూడదని, భూములను మ్యాపింగ్ చేయాలని, రైతుబంధు తీసుకుంటున్న రైతుల భూములను పరిశీలించాలన్నారు. ప్రభుత్వం నూతన చట్టంపై రైతుల అభిప్రాయాలు తీసుకొని చట్టం చేయడం అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు మధు, దామోదర్, బార్ అసోసియేషన్ సభ్యుడు సోమేశ్, తహసీల్దార్లు, న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, రిటైర్డ్ అధికారులు, రైతు సంఘం నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్నూరుకాపులు ఐక్యంగా సాగాలి

## ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఆగస్టు 24 : మున్నూరుకాపులందరూ రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో ముందుకుసాగాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మున్నూరుకాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న మున్నూరుకాపులకు మంత్రివర్గంలో చోటులేకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో విఠల్, కనకయ్య, చంద్రయ్య, బాలకిషన్‌రావు, శ్రీరామ్ చక్రవర్తి, మల్లేషం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# వసతి గృహ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

## ఖమ్మం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన

ఖమ్మం, ఆగస్టు 24 : వసతి గృహాల్లో పారిశుధ్య పనులు రోజువారీగా చేపట్టాలని, విద్యార్థులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అక్కడికి భారీగా చేసుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న విద్యార్థులను అడ్డుకున్నారు. దీంతో గేటు ఎదుట బైఠాయించిన విద్యార్థులు ఆందోళన కొనసాగించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ మాట్లాడారు. నగరంలోని సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పారిశుధ్య లోపం శాపంగా మారిందన్నారు. దీంతో పలు హాస్టళ్లలో విద్యార్థులు విషజ్వరాల బారినపడుతున్నా.. సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, మెనూ ప్రకారం అల్పాహారం, నాణ్యమైన భోజనం అందించాలని, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, మధు, జిల్లా సహాయ కార్యదర్శులు శివనాయక్, వంశీ, రూరల్ మండల కార్యదర్శి బూర మనోజ్, జిల్లా నాయకులు రాకేష్, ప్రతాప్, పవన్, మౌనిక, వేద, కీర్తి తదితరులు పాల్గొన్నారు



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు


పెద్దతండా పంచాయతీ వ్యూ

- యం.వెంకటాయపాలెం కేంద్రంగా కొత్త మండలం
- కనుమరుగు కానున్న 'ఖమ్మం రూరల్' పేరు
- అధికారుల ప్రతిపాదనలతో జోరుగా చర్చ
- హైవే హబ్‌గా మారనున్న రూరల్ ఏరియా

| ఖమ్మం రూరల్ మండలం | | |
|---|---|---|
| మొత్తం పంచాయతీలు | : | 31 |
| మండల జనాభా(2011) | : | 81,469 |
| మొత్తం ఓటర్ల సంఖ్య | : | 90,711 |

# రూరల్ రూపాంతరం..!


## పెద్దతండా కేంద్రంగా మున్సిపాలిటీ ఏర్పాటు

భౌగోళికంగా, జనాభా ప్రకారంగా అతిపెద్ద మండలంగా ఉన్న 'ఖమ్మం రూరల్' రూపాంతరం చెందనున్నది. మండల విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో విభజన అంశం కేసీఆర్ ప్రభుత్వంలోనే తెరపైకి వచ్చింది. కానీ సాధారణ ఎన్నికల కారణంగా ప్రతిపాదనలు ముందుకుసాగలేదు. అయితే తాజాగా 'పెద్దతండా' మున్సిపాలిటీ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాల్సిందిగా రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మరోసారి మండలవ్యాప్తంగా చర్చ జోరందుకుంది. అంతేకాదు యం.వెంకటాయపాలెంలో కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా పోలీస్ కమిషనరేట్ రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించింది. ఏదేమైనా ఖమ్మంరూరల్ మండలంలోని కొన్ని గ్రామాలతో కలిసి ఒక మున్సిపాలిటీ, మిగిలిన గ్రామాలతో కలిసి కొత్త మండలం అవతరించనుండడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇదే జరిగితే భవిష్యత్తులో 'ఖమ్మం రూరల్' పేరు ఇక వినిపించకపోవచ్చు. - ఖమ్మం రూరల్, ఆగస్టు 24

పాలేరు నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో అతిపెద్ద మండలం ఖమ్మంరూరల్. తాజా గణాంకాల ప్రకారం ఇందులో 31 పంచాయతీలు ఉన్నాయి. గతంలో పెద్దతండా, ఏదులాపురం, గుర్రాలపాడు, గుదిమళ్ల, వెంకటగిరి గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనంకావడంతో రఘునాధపాలెం మండల పరిధిలోని కామంచికల్, పడమటితండా, జాన్‌బాద్‌తండాలను రూరల్ పరిధిలోకి తీసుకొచ్చారు. అయితే విలీన పంచాయతీల పరిధిలోని ప్రజల కోరిక మేరకు కార్పొరేషన్ నుంచి విడదీసి ఆ గ్రామాలను మళ్లీ ఖమ్మంరూరల్ మండల పరిధిలోకి తెచ్చిన సంగతి విదితమే. దీంతో ప్రస్తుతం 28 పంచాయతీలకు తోడు మరో మూడు పంచాయతీలైన పడమటితండా, కామంచికల్, దారేడు రూరల్ పరిధిలోకి వచ్చాయి. ఈ మేరకు ఒక లక్ష ఓట్లకు పైబడిన మండలంగా ఖమ్మరూరల్ అవతరించింది. అయితే మండల విస్తీర్ణం భారీగా పెరగడంతో మరో మండల కేంద్రం కానీ, విలీన పంచాయతీలతో కూడిన గ్రామాలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చర్చ జరిగింది. దీంతో అప్పట్లో అభివృద్ధి, రెవెన్యూ అధికారులు ఇందుకు సంబంధించి విభజన ప్రక్రియతో కూడిన బ్లూప్రింట్‌ను సైతం సిద్ధం చేశారు. అయితే ఎన్నికలు సమీపించడమో మరేమి కారణమో తెలియదు గానీ ఆ ప్రతిపాదన ముందుకు సాగలేదు. తాజాగా రెండ్రోజుల నుంచి మరోసారి మండల విభజన, మున్సిపాలిటీ ఏర్పాటుపై మండలవ్యాప్తంగా చర్చ జోరందుకుంది.

### మండలకేంద్రంగా యంవీ పాలెం..

మండలంలోని యం.వెంకటాయపాలెం మండల కేంద్రంగా అవతరించబోతుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. యంవీ పాలెంను మండల కేంద్రంగా ప్రకటించేందుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రక్షాళన జరిగింది. ఏఏ గ్రామాలు విలీనం చేయాలి, భౌగోళిక, నైసర్గిక స్వరూపం తదితర అంశాలు సాధ్యాసాధ్యాలపై అధికారులు నివేదికను సైతం సిద్ధం చేశారు. తాజాగా యం.వెంకటాయపాలెం గ్రామంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి జిల్లా పోలీస్ కమిషనరేట్ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపించడంతో యంవీ పాలెం మండల కేంద్రంగా అవతరించబోతున్నది అనే వాదనకు బలం చేకూరింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే స్థల పరిశీలన సైతం చేసినట్లు తెలుస్తున్నది. పెద్దతండా మున్సిపాలిటీ పరిధిలోకి పెద్దతండా, ఏదులాపురం, గుర్రాలపాడు, బారుగూడెం, చిన్నవెంకటగిరి, గొల్లగూడెం, గుదిమళ్ల, మద్దులపల్లి, ముత్తగూడెం, పోలెపల్లి పంచాయతీలను తీసుకొచ్చేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేసినట్లు సమాచారం. మొత్తంగా సాగర్ కాలువ హద్దులుగా మున్సిపాలిటీ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ గ్రామాలు అవతల.. భూములు ఇవతల ఉండడం వల్ల హద్దుల ప్రక్రియపై ఫైనల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన 21 పంచాయతీలతో యం.వెంకటాయపాలెం మండల కేంద్రంగా ఉండే అవకాశం కనపడుతున్నది.



ఖమ్మం రూరల్ మ్యాప్



ఎంవీ పాలెం పంచాయతీ కార్యాలయం

### జాతీయ రహదారుల కూడలిగా..

రూరల్ మండలం మరికొద్ది రోజుల్లోనే ఒకవైపు మున్సిపాలిటీ మరోవైపు నూతన మండలంతో పాటు, జాతీయ రహదారుల కూడలిగా అవతరించబోతుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించి ఆయా ప్రదేశాల నుంచి వచ్చే అతిపెద్ద రహదారుల నిర్మాణల ప్రక్రియ మండల కేంద్రానికి చేరుకుంటున్నాయి. కోదాడ టూ కురవి గ్రీన్‌ఫీల్డ్ హైవే, సూర్యాపేట టూ దేవరపల్లి హైవేతోపాటు నాగపూర్ టూ అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణపనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ మూడు ప్రధాన రహదారులు మండలంలోనే కలవబోతుండడంతో జాతీయ రహదారుల కూడలిగా రూరల్ మండలం రూపాంతరం చెందనుంది. వీటికి తోడు నాయుడుపేట నుంచి యంవీ పాలెం వరకు నాలుగులేన్ల ప్రధాన రహదారి నిర్మాణ పనులు సైతం జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో మరికొద్ది రోజుల్లోనే పాలేరు నియోజకవర్గంలోనే తొలి మున్సిపాలిటీగా పెద్దతండా అవతరించే అవకాశం ఉందని మండల వ్యాప్తంగా చర్చ జోరుగా కొనసాగుతున్నది. అయితే ఇందుకు సంబంధించి అటు రెవెన్యూ, ఇటు అభివృద్ధి అధికారులు మాత్రం తమకు లిఖితపూర్వకంగా ఆదేశాలు రావాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

# సీహెచ్‌సీకి సుస్తీ!

- శిథిలావస్థకు చేరిన బూర్గంపహాడ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్
- భయం భయంగా చికిత్స పొందుతున్న రోగులు
- భవన నిర్మాణానికి గత కేసీఆర్ ప్రభుత్వం రూ.2.70 కోట్లు మంజూరు
- కాంగ్రెస్ పాలనలో టెండర్ల ప్రక్రియకు బ్రేక్
- పోస్టుమార్టం కోసం భద్రాచలం వెళ్లాల్సిందే..
- భవన నిర్మాణం చేపట్టాలని కోరుతున్న రోగులు, ప్రజలు


శిథిలావస్థలో మార్చురీ గది

సారపాక, ఆగస్టు 24 : నిత్యం వందలాది మంది రోగులకు వైద్య సేవలు అందించే బూర్గంపహాడ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) శిథిలావస్థకు చేరింది. ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చే రోగులకు తగినట్లుగా వసతులు లేకపోవడం.. ఆసుపత్రి భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులు జంకుతున్నారు. బూర్గంపహాడ్ మండలానికి చెందిన రోగులతోపాటు ములకలపల్లి, ఆంధ్రా రాష్ట్రంలోని కుక్కునూరు తదితర ప్రాంతాల నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో వైద్యం కోసం ఆసుపత్రికి వస్తుంటారు. వచ్చిన రోగులకు వైద్యులు వైద్యం అందిస్తున్నా.. ఆసుపత్రిలో చేరి చికిత్స పొందే వారికి పూర్తిస్థాయిలో బెడ్లు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. 30 పడకల స్థాయి కావడంతో జ్వరాల తీవ్రతతో ఆసుప్రతికి వచ్చే వారికి బెడ్లు సరిపోక బెడ్డుకు ఇద్దరు ముగ్గురు చొప్పున పడుకొని చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది. అంతేకాక స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయగా.. మరమ్మతుల కారణంగా అది పనిచేయడం లేదు. ఆసుపత్రి ప్రహరీ కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయే దశకు చేరింది. నిర్మాణానికి గత కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఇంత వరకు నిర్మాణ పనులు చేపట్టలేదు. వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులతోపాటు రోగులు కోరుతున్నారు.

### భవన నిర్మాణానికి రూ.2.70 కోట్లు మంజూరు

గత కేసీఆర్ పభుత్వ హయాంలో పినపాక ఎమ్మెల్యేగా ఉన్న రేగా కాంతారావు బూర్గంపహాడ్ ఆసుపత్రిని సందర్శించి.. శిథిలావస్థకు చేరిన ఆసుపత్రి భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. దీంతో అప్పటి ప్రభుత్వం రూ.2.70 కోట్లు మంజూరు చేసింది. పూర్తిస్థాయిలో వైద్యం అందించేందుకు 8 మంది వైద్యులను సైతం నియమించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన త ర్వాత నూతన ఆసుపత్రి భవన నిర్మాణ ప్రతిపాదనకు, టెండర్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. 8 నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఇక్కడ పనిచేసే వైద్యులతోపాటు రోగులు కూడా శిథిల భవనం ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు.


శిథిలావస్థకు చేరిన ఆసుపత్రి భవనం

### కూలేందుకు సిద్ధంగా మార్చురీ

పోస్టుమార్టం గది కూడా పూర్తి శిథిలావస్థకు చేరింది. నెల రోజుల క్రితం పోస్టుమార్టం సమయంలో ఓ వైద్యుడిపై స్లాబ్ పెచ్చులు ఊడిపడిన ఘటన కూడా చోటు చేసుకుంది. దీంతో అప్పటి నుంచి అక్కడ పోస్టుమార్టం నిర్వహించడం లేదు. పోస్టుమార్టం చేయించాలంటే ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రికి మృతదేహాలను తీసుకెళ్లాలని వారి కుటుంబ సభ్యులకు వైద్యులు సూచిస్తున్నారు.

### టాయిలెట్స్ నిర్మించారు.. వాటర్ కనెక్షన్ మరిచారు..

మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం ఐటీసీ సౌజన్యంతో ఆసుపత్రి ఆవరణలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించారు. బోరు సౌకర్యం కల్పించారు. అయితే ఇప్పటివరకు వాటర్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో టాయిలెట్స్‌ను వాడుకునేందుకు రోగులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న ఆసుపత్రి కాంపౌండ్ వాల్

### సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతాం.. : ముక్కంటేశ్వరరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్



నేను ఇటీవలే చార్జి తీసుకున్నా. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నాం. అయితే భవన నిర్మాణ టెండర్ల ప్రక్రియ నిలిచిపోయిందని తెలిసింది. ఈ విషయం కలెక్టర్ దృష్టిలో ఉంది. పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. ఆయా సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతాం.

# రుణమాఫీ కోసం ధర్నా


వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పెనుబల్లి, ఆగస్టు 24 : అర్హులైన రైతులకు ఎలాంటి షరతులు, కొర్రీలు లేకుండా రూ.2 లక్షల లోపు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెనుబల్లి రైతు వేదిక వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రుణాలు మంజూరు చేసే సమయంలో లేని నిబంధనలు మాఫీ సమయంలో విధించడం ఏమిటని ప్రశ్నించారు. దీనివల్ల 70 శాతం మంది రైతులకు రుణమాఫీ పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పుడు ప్రతి రైతు రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రసాద్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చలమాల విఠల్రావు మాట్లాడుతూ జిల్లాలో 30 శాతం రైతులకు మాత్రమే ఇప్పటివరకు రుణమాఫీ జరిగిందన్నారు. మాఫీ కాని రైతులు వ్యవసాయ కార్యాలయాలు, రైతు వేదికల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు చలమాల నర్సింహారావు, పోట్రు రాజారావు, నల్లమల అరుణ ప్రతాప్, తాండ్ర రాజేశ్వరరావు, నాగులు, మంద వెంకటేశ్వరరావు, పాలగాని వెంకటేశ్వరరావు, లింగనబోయిన రాఘవులు, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

# వందశాతం సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి చర్యలు

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 24 : ఖమ్మం నియోజకవర్గంలో వందశాతం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళిశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఖమ్మం నగరం 2వ డివిజన్‌లోని పాండురంగపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రోడ్లు ప్రగతి సూచికలని, నియోజకవర్గ పరిధిలో అవసరమున్న ప్రతిచోట రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాణ్యతలో రాజీ లేకుండా, సకాలంలో పనులు పూర్తయ్యేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. రహదారి పనుల్లో గృహాలు ఉన్నచోట డ్రైన్ల పనులు పూర్తి చేయాలన్నారు. నగరం అందంగా, పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కొత్తగా ఇండ్లు నిర్మించుకుంటున్న కాలనీలకు రోడ్డు మార్గాలకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల కాలం కావునా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ, నీటినిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి, కార్పొరేటర్లు మల్లీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరు వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, పాలెపు వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.


సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

# ఖమ్మం ఆర్టీసీ రీజియన్‌కు అవార్డులు

- రాష్ట్రంలోనే ఉత్తమ డిపోగా సత్తుపల్లి
- ఉత్తమ బస్టాండ్‌గా ఖమ్మం కొత్త బస్ స్టేషన్



ఉత్తమ ఖమ్మం న్యూ బస్టాండ్ అవార్డు అందుకుంటున్న ఖమ్మం డిపో మేనేజర్

ఖమ్మం/సత్తుపల్లి టౌన్, ఆగస్టు 24 : ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్టీసీకి అవార్డుల పంట పండింది. ఉత్తమ ఉద్యోగులు, అధికారులకు ప్రగతి చక్ర పురస్కారాలను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హైదరాబాద్‌లో శనివారం అట్టహాసంగా ప్రదానం చేసింది. రాష్ట్రంలోని 99 డిపోలలో సత్తుపల్లి డిపో రాష్ట్రంలోనే నంబర్ వన్ డిపోగా ఎంపికైంది. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ చేతులమీదుగా రూ.3 లక్షల అవార్డును సత్తుపల్లి డీఎం యు.రాజ్యలక్ష్మి అందుకున్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో ఖమ్మం కొత్త బస్టాండ్‌కు ఉత్తమ బస్ స్టేషన్ అవార్డు దక్కింది. అవార్డును ఖమ్మం డిపో మేనేజర్ దినేశ్‌కుమార్ అందుకున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జోన్ ఈడీ సి.వినోద్‌కుమార్, ఖమ్మం జిల్లా రీజినల్ మేనేజర్ సరిరామ్ పాల్గొన్నారు. అలాగే ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులుగా బెస్ట్ పీఎంఎస్ కోర్ గ్రూప్ సూపర్‌వైజర్‌గా రీజినల్ కార్యాలయం నుంచి బి.సైదులు, బెస్ట్ మెకానిక్‌గా మణుగూరు డిపోకు చెందిన పి.రవి, బెస్ట్ హెల్పర్‌గా మణుగూరు డిపోకు చెందిన డి.సతీశ్‌కుమార్, బెస్ట్ హైర్ బస్ డ్రైవర్‌గా సత్తుపల్లి డిపోకు చెందిన సీహెచ్.కిశోర్‌బాబు, కేఆర్.బాబు అవార్డులు అందుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజియన్ తరపున అవార్డు గ్రహీతలకు ఆర్ఎం సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు భవానీ ప్రసాద్, జీఎన్ పవిత్ర అభినందనలు తెలిపారు. కాగా.. గత సంవత్సరం రెండో బహుమతి దక్కించుకున్న సత్తుపల్లి డిపో అధికారులు, సిబ్బంది మరింతగా శ్రమించి ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి స్థానం దక్కించుకొని అందరి మన్ననలు పొందారు.



ఉత్తమ ఆర్టీసీ డిపో అవార్డు అందుకుంటున్న సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి